

నేడు రాష్ట్ర స్థాయి 'ఉక్కు' సదస్సు

కడప అర్బన్ : కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉక్కు సదస్సు శుక్రవారం యుటిఎఫ్ భవన్‌లో నిర్వహించనున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, శివకుమార్ తెలిపారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఉక్కుపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తుందన్నారు. విభజన హామీలలో కడప ఉక్కు ఇవ్వాలని చట్టం ఉన్నా అది అమలు కాలేదన్నారు. ఒకటికి కడప వేదికగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమం శ్రీకారం చుట్టబోతున్నమన్నారు. సదస్సుకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఉక్కు సాధన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు బి. నారాయణ, మాజీ డివైఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. సదస్సుకు నిరుద్యోగ యువతీ, యువకులు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, ఓబులేసు, ఉపాధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మేయర్ సురేష్‌బాబు

గరం గరం

కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం గరంగరంగా నడిచింది. కడప నగర మాస్టర్‌ప్లాన్‌పై చర్చకు పెట్టకపోవడంపై నిలదీత మొదలుకుని కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడడమనే తీవ్ర ఆరోపణలు చేయడం, కార్పొరేషన్ శివారు ప్రాంతాల్లోని స్థలాల ఆక్రమణలు, చివరికి ఎకోపార్కు పనులపై విజిలెన్స్ విచారణకు డిమాండ్ చేయడం గమనార్హం. వీటిపై డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా జోక్యం చేసుకోవడం, మేయర్ మొక్కుబడిగా తలూపడం, ఎంఎల్‌సి రామచంద్రారెడ్డి స్తోత్కర్షలు, కమిషనర్ సూర్యసాయి ప్రవీన్‌చంద్ మొక్కుబడి స్పందనలతో తుస్సుమ నేలా ముగిసింది.

సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్ల కుతకుత
కమిషనర్ పేరుతో అక్రమ వసూళ్లపై ఫైర్
'ఎకో'పై విజిలెన్స్ విచారణకు డిమాండ్
కార్పొరేషన్ స్థలాల ఆక్రమణపై ఆందోళన
మాస్టర్‌ప్లాన్‌పై కార్పొరేటర్ల ఆగ్రహం
సచివాలయ ఉద్యోగుల తీరుపై ధ్వజం



హాజరైన డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం అధికార పార్టీ కార్పొరేటర్ల తీరు వన్‌మ్యాన్ షోను తలపించింది. గురువారం కార్పొరేషన్‌లోని మూడవ అంతస్తులోని సభాభవన్‌లో మేయర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కడప నగర మాస్టర్‌ప్లాన్‌పై చర్చకు ఎందుకు పెట్టలేదని కార్పొరేటర్ పాకా సురేష్ నిలదీశారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ డిప్యూటీ ప్లానింగ్ ఆఫీసర్‌ను వివరించాలని ఆదేశించారు. డిసిపి వివరణ పట్ల కార్పొరేటర్లు సంతృప్తి చెందక పోవడంతో కమిషనర్ జోక్యం చేసుకుని కోవిడ్ సమయంలో మాస్టర్ ప్లాన్ రావడంతో పూర్తి స్థాయిలో చర్చకు పెట్టలేకపోయారని తెలిపారు. యుడిఆర్ఐ గవర్నెన్స్ ప్రకారం అనుడా అధికారులు మాస్టర్ ప్లాన్ తెచ్చారన్నారు. దీనిపై డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా స్పందించి మాస్టర్‌ప్లాన్‌పై అనుడా, కార్పొరేషన్, ప్రజాప్రతినిధులతో కలిపి సమావేశం ఏర్పాటు చేసి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. రూ.30 కోట్ల వ్యయంతో నిర్మించిన ఎకోపార్క్ భవనాన్ని టెండర్ కండిషన్స్ మేరకు స్వాధీనం చేసుకోకపోవడాన్ని తప్పుబట్టారు. గతంలో కమిషనర్ ఆరుసార్లు టెండర్ కండిషన్ల మేరకు నిర్మాణాలు చేపట్టడం లేదని ఆరుసార్లు నోటీసులు జారీ చేశారని, దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దీనిపై మేయర్ స్పందించి గత్యంతరం లేకపోవడంతో విజిలెన్స్ విచారణకు ఆదేశిద్దామని పేర్కొనడం గమనార్హం. తర్వాత కార్పొరేషన్ పరిధిలోని శ్మశానవాటికల అభివృద్ధికి కార్పొరేటర్లతో కమిటీ వేయాలని, సమస్యలు తలెత్తితే కార్పొరేటర్ల కమిటీ వెళ్లి చర్చించి పరిష్కారం చూపుతుందని డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా పేర్కొన్నారు. తిలక్ నగర్, రామకృష్ణానగర్ ప్రాంతాల్లో మట్టి రోడ్డు ప్రతిపాదనలకు ఏళ్ల తరబడి మోక్షం లభించకపోవడంపై కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ విలీన ప్రాంతాల్లో వీధిలైట్లు కూడా వెలగడం లేదని, తాగునీరు కలుషితం గాకుండా చూడాలని ఆందోళన వ్యక్తం చేశారు. ముంపు నివారణకు డ్రెయినేజీ పనులు ఎప్పుడు చేపడతారని నిలదీశారు. కార్పొరేషన్ శివారు ప్రాంతాలైన ఇందిరానగర్, చెర్లోపల్లి, మామిళ్లపల్లి ప్రాంతాల్లోని స్థలాలు అక్రమణలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి కమిషనర్ స్పందించి కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వస్థలాలు, లేఅవుట్లు తదితర వివరాల డేటాను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్‌బంకును క్యాష్‌లెస్ పద్ధతిలో నిర్వహించాలని సూచించారు. అనంతరం కార్పొరేషన్‌లో ముంపును నిలువరించడానికి ఉద్దేశించి రూ.69 కోట్లతో 21 డ్రెయినేజీలను ప్లాన్ చేశామని వివరించారు. పాత మున్సిపాలిటీ స్థలంలో మల్టీప్లెక్స్, షాపింగ్‌మాల్ ఏర్పాటు వ్యవహారంలో జాప్యాన్ని కార్పొరేటర్లు ప్రశ్నించారు. సంబంధిత కాంట్రాక్టు అప్పగించి ఏళ్ల తరబడి జాప్యం జరుగుతున్నప్పటికీ ప్లానింగ్ సెక్షన్ ఏమిచేస్తోందని ప్రశ్నించారు. రూ. 60 కోట్ల ఆస్తి వృథాగా మారడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ స్పందించి సదరు కాంట్రాక్టర్‌కు ఆరుసార్లు రిమైండర్స్ జారీ చేశామని, లీగల్ ప్రకారం ముందుకెళ్లి పరిష్కారించడానికి ప్రయత్నం చేస్తామని చెప్పారు. అనంతరం కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్ వ్యవహారం వేడెక్కించింది. అద్దె గదుల నిర్వాహకుల దగ్గర నుంచి కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ల పేర్లతో కూడిన నెంబర్‌తో ఫోన్ చేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పలు వురు కార్పొరేటర్లు విరుచుకుపడ్డారు. దీనిపై కమిషనర్ సీరియస్‌గా తీసుకోకపోవడం విస్మయాన్ని కలిగించింది. కోర్టు స్టేల కారణంగా స్వాధీనం చేసుకోవడం కుదరడం లేదని రెవెన్యూ అధికారులు చెప్పినప్పటికీ సంతృప్తి కలగకపోవడం గమనార్హం. ఒకటి, రెండు గదులపై కోర్టు స్టే విధించిందని, మిగిలిన గదులను ఎందుకు స్వాధీనం చేసుకోలేదనే ప్రశ్నలకు సమాధానం కరువైంది. కార్పొరేషన్‌లో కలుషిత నీరు సరఫరా అవుతుందనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, కలుషిత నీటిని నిలువరించాలని ఆదేశించి నప్పటికీ ఆశించిన స్పందన కరువైందని, కార్పొరేషన్ అధికారుల పనితీరు అధ్వాన్నంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కార్పొరేటర్ సూర్య నారాయణ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల తీరు అధ్వానంగా ఉందని, కార్పొరేటర్లు సమస్యను తీసుకెళ్తే కమిషనర్ చెబితే చేస్తామని ముక్తసరిగా చెబుతున్నారని, అదే పనులపై బాధితులే వెళ్తే సచివాలయం పక్కకు తీసుకెళ్లి మాట్లాడుకుంటు న్నారని వివరించారు. సచివాలయాలు అవినీతికి నిలయాలుగా మా రాయని విమర్శించారు. దీనిపై డిప్యూటీ సిఎం స్పందించి కార్పొరేషన్ మొదలుకుని సచివాలయాన్నింట్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసి మానిటరింగ్ చేయాలని సూచించారు. దీనికి కమిషనర్ స్పందించి ఇప్పటికే కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసి మానిటరింగ్ చేస్తున్నా మని,సచివాలయాలకు వర్తింపజేస్తామని చెప్పారు. అంతకుముందు ఉపాధ్యాయ ఎంఎల్‌సి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పాత మున్సిపల్ స్థలాభివృద్ధి తరహాలోనే పాత కలెక్టరేట్‌ను సైన్స్ మ్యూజియంగా మార్పు చేయాలని సూచించారు.

సిఎం జగన్ మహిళా పక్షపాతి

- డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా



అర్బన్ మెప్మా బజార్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-కడప అర్బన్

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళా పక్షపాతిగా అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక 1 వ టౌన్ పరిధిలోని దిశ పోలీస్ స్టేషన్ వద్ద పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మెప్మా బజార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు చేసిన ఉత్పత్తులన్నీ అర్బన్ మెప్మా బజార్‌లో విక్రయించ వచ్చ న్నారు. ముఖ్యమంత్రి మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. కుటుంబ బరువు బాధ్యతలు మహిళలు మాత్రమే మోస్తారని కాబట్టి కచ్చితంగా వారి ఖాతాలోనే డబ్బులు వేస్తేనే అవి పూర్తిస్థాయిలో సద్వినియోగం అవుతాయని పేర్కొన్నారు. 40 సంవత్సరాల నుంచి 60 సంవత్స రాలలోపు ఉన్న మహిళలందరికీ వైఎస్ఆర్ చేయూత వర్తింప జేస్తున్నారని చెప్పారు. ఆహా క్యాంటీన్ ఒక అద్భుతమైన కాన్సెప్ట్ అని స్వయం సహాయక బృందాల మహిళలు పట్టణ ప్రాంతంలో ఆహా క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కార్యక్ర మంలో మెప్మా ఎమ్‌డి విజయలక్ష్మి, సురేష్‌రెడ్డి, స్టేట్ ఎస్ఎంసి ఆదినారాయణ, ఎస్‌హెచ్‌జి గ్రూప్‌ల మహిళలు పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ విద్యాసంస్థలను పెంచి పోషిస్తున్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా ప్లీనరీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చి పూర్తిగా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రోజుకొక జీఓ తీసుకువచ్చి విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేస్తుందన్నారు. పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసేలా జీఓ నెంబర్ 77 తీసుకువచ్చి పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ ఆపేసిందన్నారు. అనేక షరతులు పెట్టి జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, అమ్మ ఒడి నిధులన్ని పెండింగులో పెట్టి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తు ందన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ ఛార్జీలు విడుదల చేయకుండా ఇబ్బందులు పెడుతు ందన్నారు. నూతనంగా ఏర్పాటైన మెడికల్ కలశాలల్లో 50 శాతం సీట్లను అమ్మకానికి పెట్టి విద్య వ్యాపారాన్ని చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మరిన్ని పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి మాజీ నాయకులు చంద్ర శేఖర్, మాజీ జిల్లా కార్యదర్శి శివకుమార్, అన్వేష్, ఓబులేసు, నరసింహులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాయక్, సగిలి రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్, సహాయ కార్యదర్శులు వినయ్, రాహుల్ విద్యార్థులు కరిష్మా, వైష్ణవి, గీత, జిల్లా నాయకులు మనోజ్, అజయ్, సుమంత్, రాజశేఖర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని
పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని గురువారం విధులు బహిష్కరించి పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ఇఒ ఎమ్.వి సుబ్బారావు తమను వేధిస్తున్నారని వాపోయారు. అదనపు పని గంటలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము గత 30 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నా చాలీ చాలని వేతనాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా సక్రమంగా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. సర్పంచ్, ఇఒ చొరవ తీసుకుని తమ కు వేతనాలు పెంచి న్యాయం చేయాలని కోరారు. ఈ సంద ర్భంగా ఇఒ సర్పంచ్ స్పందిస్తూ తమ గ్రామానికి వారు ఎంతో సేవ చేస్తున్నారని, వారికి ప్రతి నెల వేతనాలు ఇచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. పారిశుధ్య కార్మి కులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా సమస్యలను తీరుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో కార్యక్రమంలో ఇఒ ఎం.వి సుబ్బా రావు, సర్పంచ్ యన మల సుధాకర్, హరికృష్ణ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు

కట్టడాలకు అనుమతి తప్పనిసరి

కలసపాడు : స్థానిక పంచాయతీలో ఏవైనా కట్టడాలు నిర్మించాలంటే పంచాయతీ అనుమతి తప్పనిసరి అని పంచాయతీ విస్తరణాధికారి గంధం మురారి అన్నారు. స్థానిక పట్టణంలోని సినిమా హాలు వద్ద ఇటీవల కొందరు గుత్తేదారులు కలిసి స్థలాన్ని కొన్నారని, పంచాయతీ ప్లానింగ్ అప్రూవల్ లేకుండా నిర్మిస్తున్నారని, అసలు ఎలా మార్కింగ్ ఇస్తారని అధికారులను అడిగారు. పంచాయతీ నియమ నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు నిర్మిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీరామాలయానికి విరాళం

చెన్నూరు : మండలంలోని షుగర్ ఫ్యాక్టరీ(దౌలాతాపురం)లో నూతనంగా నిర్మించబోయే శ్రీసీతారామ లక్ష్మణ సమేత వీరాంజనేయస్వామి ఆల య నిర్మాణానికి గురువారం టిడిపి నాయకులు సాయినాథశ్మ అభిమానులు విరాళం అందజేశారు. తుపాకుల జనార్ధన్‌రెడ్డి, పద్దబుద్ది వెంకట శివప్రసాద్ ఆలయ కమిటీ సభ్యులకు గ్రామ పెద్దల సమక్షంలో రూ. లక్ష పంపిణీ చేశారు. కార్యక్రమంలో చదిపిరాల ప్రసాద్ రెడ్డి, పొట్టి పాటి రానా ప్రతాపరెడ్డి , ఆలయ కమిటీ సభ్యులు నాగరాజు, సుబ్బ య్య, చంద్రశేఖర్ రెడ్డి, పవన్, కరుణాకర్, లోకేష్, వార్డ్ మెంబర్లు, కుమార్, వెంకటేష్, రాఘవ రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

కనీస వసతులు కల్పించాలి

పోరుమామిళ్ల టౌన్ : పోరుమామిళ్ల సమీపంలో ఎస్‌టి కాలనీలో నివసిస్తున్న ప్రజలకు కనీస వసతులు లేక అవస్థలు పడుతున్నారని, నివాస గృహాలు లేక పోవడంతో పూరి గుడిసెలు వేసుకొని 30 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారని, వారికి మౌలిక వసతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక సంక్షేమ కార్యదర్శి యోహాను, జిల్లా కన్వీనర్ సి. ఓబయ్య నియోజకవర్గ ఎస్‌టి సంఘం అధ్యక్షులు కావడి కొండయ్య డిమాండ్ చేశారు. గురువారం పోరుమామిళ్లలోని కాలనీలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కులవృతిపై ఆధారపడినప్పటికీ జీవన విధానంలో ఎలాంటి మార్పు లేదని వాపోయారు. ప్రతి కుటుంబానికీ ఇంటి స్థలం పట్టా మంజూరు చేసి పక్కా గృహాలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జగన్నాథం నాగయ్య, ఉపాధ్యక్షులుగా జగన్నాథం మద్ది లేటి, కార్యదర్శిగా దాసరి రామసుబ్బయ్య, కమిటీ సభ్యులుగా శ్రీరామ్, చిన్న రామయ్య, దాసరి సుబ్బరాయుడును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ఉద్యోగులు కీలకం

కడప అర్బన్ : ప్రజా సమస్యలు పరిష్కరించడంలో సచివాలయలో పని చేస్తున్న ఉద్యోగులు కీలకమైన పాత్ర పోషించాలని మాస్టర్ ట్రైనర్ గద్దె చంద్ర శేఖర్‌రావు పేర్కొన్నారు. జిల్లాలోని బద్వేలు, జమ్మలమడుగు, పులి వెందుల , కడప, రాయచోటి, ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పని చేస్తున్న సచివాలయ ఉద్యోగులకు నిర్వహించిన నాలుగు రోజుల శిక్షణ తరగతులు ముగింపు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం, వారి అభివృద్ధి కోసం బాధ్యతగా తమ విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల సమస్యలు నిర్ణీత సమయంలో, అంకిత భావంతో పరిష్కరించినప్పుడే ప్రభుత్వానికి, ఉద్యోగులకు మంచి గుర్తింపు దక్కుతుందని పేర్కొన్నారు. రానున్న వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని వీధులు, వాడల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం కంప్యూటర్ ల్యాబ్‌లో జరుగుతున్న జూనియర్ అసిస్టెంట్ శిక్షణను అకస్మికంగా విసి చింతా సుధాకర్ తనిఖీ చేశారు. శిక్షణ పొందుతున్న జూ నియర్ అసిస్టెంట్‌లతో మాట్లాడుతూ విద్యార్థుల హాజరు, మార్కుల శాతం ఎలా లెక్కించాలో నేర్చుకోవాలన్నారు. వీటితోపాటు ఇంగ్లీష్ టైపింగ్, ఎంఎస్ వర్డ్, ఎంఎస్ ఎక్సెల్ పూర్తిగా నేర్చుకోవాలని ప్రతి బ్యాచ్‌కు 25 మందికి శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్క జూనియర్ అసిస్టెంట్ సద్వినియోగం చేసుకోవాలని ఇలాంటి గొప్ప అవకాశం మరి రాదని ఆయన ఉద్ఘాటించారు. కంప్యూటర్ సైన్స్ సహ ఆచా ర్యులు డాక్టర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ కృష్ణయ్య, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

117 జిఒను రద్దు చేయాలి

ప్రజాశక్తి కడప అర్బన్



వినతి పత్రం అందజేస్తున్న లెక్కల జమాల్‌రెడ్డి

ఉపాధ్యాయుల రేషనలైజేషన్ జీవో 117ను రద్దు చేయాలని లేకపోతే ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగు అవుతాయని, మిగతా కాంట్రాక్టు ఉద్యోగుల మాదిరిగానే గురుకుల, కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ రెగ్యులర్ చేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ వెంకట్రామిరెడ్డికి రాష్ట్ర కో చైర్మన్ లెక్కల జమాల్ రెడ్డి, వైయస్సార్ జిల్లా కో చైర్మన్ వల్లెం సుబ్బారెడ్డి, కడప యూనిట్ ప్రెసిడెంట్ శివ శేషాద్రి రెడ్డి డిమాండ్ చేశారు. గు రువారం కడపకు వచ్చిన వెంకట్రామిరెడ్డికి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా లెక్కల జమాల్ రెడ్డి మాట్లాడుతూ జీవో 117 ప్రభుత్వ పాఠశాలకు శాపమని గతంలో ఎన్నడూ లేని విధం గా ఏ బదిలీల్లో జరిగిన విధంగా సెక్షన్‌కు 60 మంది విద్యా ర్థులు, సెక్షన్ల వారిగా ఉపాధ్యాయులను లెక్కించి రేషనలైజేషన్ చేయడం వల్ల అనేక ప్రభుత్వ పాఠశాల ఇబ్బంది ఎదు ర్కొంటాయని తెలిపారు.రద్దు చేయకపోతే ప్రభుత్వ పాఠశాలలో కనుమరుగతాయని అన్నారు. 2014, జూన్ 2కు ముందుకు చేరిన కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని ముఖ్య మంత్రి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని చెప్పారు.

అధికారం కోసమే టిడిపి నాయకులపై కేసులు

కడప అర్బన్ : వైసిపి తిరిగి అధికారం కోసమే, తెలుగుదేశం పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తుందని టిటిడి మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ విమర్శించారు. పుంగనూరు, అంగళ్ళ వద్ద అల్లర్లలో కేసులో సెంట్రల్ జైల్లో ఉన్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలను పుట్ట సుధాకర్ యాదవ్, హరి ప్రసాద్ కలిసి పరామర్శించారు. అనంతరం సెంట్రల్ జైలు వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా చంద్రబాబు పుంగనూరు పర్యటనలో అంగళ్ళ వద్ద వైసిపి మూకలు రాళ్లదాడి చేస్తే టిడిపి నేతలు, నాయకులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించాలని పేర్కొన్నారు. సిఎం జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో చంద్రబాబు పర్యటనకు విశేష జనాదరణను చూసి, ఓడి పోతామన్న భయంతోనే, వైసిపి ప్రభుత్వ అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. చట్టాన్ని కాపాడాల్సిన చిత్తూరు ఎస్‌పి వైసిపి దుస్తులు వేసుకుని తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. సంఘటనలో లేని శ్రీనివాసరెడ్డిని కేసులో ఇరికించడం నీచ రాజకీయానికి నిదర్శనమన్నారు. అధికారం ఉంది కదా అని 262 మందిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతారా అని వారు ప్రశ్నించారు. కేసులు ఎత్తివేయకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అమీర్, రాంప్రసాద్, జయ కుమార్, కొమ్మలపాటి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఉన్నతమైన లక్ష్యంతో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



చిన్నచౌక్‌కు సిఐని కలిసిన, విద్యార్థులు, డైరెక్టర్

విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యంతో ముందుకెళ్లాలని చిన్నచౌక్ సిఐ నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల చిన్నచౌక్ సిఐ గా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను పుష్పగిరి విద్యాసంస్థల డైరెక్టర్, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎం. వివేకానంద రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వివేకానంద రెడ్డి మాట్లాడుతూ 1992లో తమ పాఠశాలలో ట్రాఫిక్ క్లబ్‌ను ప్రారంభించామని తెలిపారు. క్రీడల్లో జాతీయ స్థాయిలో జిల్లాకుపేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రవి కుమార్, పాఠశాల సిబ్బంది సంధ్య రెడ్డి, చంద్రఓబుల్‌రెడ్డి, జయచంద్ర బాబు పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - కడప అర్బన్



ఇంటింటి ప్రచారంలో నాయకులు

డివిజన్ ఇన్‌ఛార్జి ఆమూరి బాలదాసు అధ్వర్యంలో వి.ఎస్. అమీర్‌బాబు ఆదేశాల మేరకు 14వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్, చంద్రమౌళి నగర్‌లో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టిడిపి నగర అధ్యక్షురాలు మురికినాటి సునీత, ప్రధాన కార్యదర్శి పార్వతి హాజర య్యారు. ఈ సందర్భంగా బాలదాసు మాట్లాడుతూ చంద్ర బాబునాయుడు ముఖ్యమంత్రిని చేస్తే మహిళలకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని చెప్పారు. సిఎం జగన్మోహన్ మోహన్‌రెడ్డి ప్రజలపై పన్నుల బారం వేసి వారిని నిలువునా దోసేస్తున్నారని విమర్శించారు. 14వ డివిషన్ ప్రజలు మౌలిక సదుపాయాలు లేక నానా ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా డ్రెయినేజీ, రహదారులు లేవని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. మున్సిపాల్టీకి పన్నులు క్రమం తప్పక కడుతున్నా మౌలిక వసతులు మృగ్యమయ్యాయని వాపోయారు. టిడిపిని ప్రజలూ ఆదరించి చంద్ర బాబునాయుడిని ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. తప్పకుండా ప్రజా సమస్యలకోసం పనిచేస్తారని తెలిపారు. కార్యక్రమంలో నిర్మలా దివాకర్, స్వర్ణలత, వరద, కిరణ్ కుమార్, 1వ డివిషన్ మురికినాటి అంజీ, కె.వి.రమణ, జెల్లా వెంకటనాథ పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - ఖాజీపేట



ముస్లిం మైనార్టీ నాయకులతో పుట్టా సుధాకర్ యాదవ్

రానున్న ఎన్నికల్లో టిడిపి బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేస్తేనే విజయం సాధించడం సులువని మైదుకూరు నియోజకవర్గ టిడిపి బాధ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. గురువారం స్థానిక ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి సిద్ధారం ఖదీరుల్లా నివాసానికి పుట్టా సుధాకర్ యాదవ్ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైసిపి అరాచకాలు, అక్రమాలను ప్రతి ఒక్కరూ ఎదిరించాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. టిడిపి కార్యకర్తలు, నాయకులకు తాను అండగా ఉంటానని, ఏ కష్టం వచ్చినా నిలుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ టి.లక్ష్మిరెడ్డి, హబీబ్, ఆర్ఎంపి డాక్టర్ ఆసిఫ్, జాఫర్, సందాని సుబ్బయ్య, బండి వెంకటేష్ పాల్గొన్నారు.

సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా

చాపాడు : టిడిపితోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. తెప్పల ఓబాయపల్లె గ్రామంలో గురువారం టిడిపి నాయకులు రవి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టా మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. అవినీతి పాలన రాజ్యమేలుతోందన్నారు. టిడిపి నాయకులపై దాడులు, అక్రమ కేసులు అధికమయ్యాయని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి మేకల బాబు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, మండల నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, నారపురెడ్డి, ఉమాకాంత్, కిరణ్ కుమార్‌రెడ్డి, రామ్మోహన్, రజని, శ్రీను, సలీం, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. పట్టణ పరిధిలోని రాణి వనం-1 సచివాలయాన్ని గురు వారం చైర్మన్, కమిషనర్ జగన్నాథ్ తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు రికార్డును పరి శీలించారు. సచివాలయ సిబ్బంది పనితీరు గురించి అక్కడున్న ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సిబ్బందిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక 20 వార్డు కౌన్సిలర్ అలీ, ఒకటవ వార్డు కౌన్సిలర్ ప్రశాంత్, మున్సిపల్ ఆర్ఓ గంగిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

'ఎంపిపి మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎంపిపి శేఖర్‌యాదవ్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని కొత్తపల్లె సర్పంచు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మత్స్య కాలనీలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపిపి రాజ శేఖర్‌రెడ్డిని కొత్తపల్లె పంచాయతీకి తీసుకురావడంతోనే మా అన్న రామచంద్రారెడ్డిని పోగొట్టుకున్నామన్నారు. అయినా ఎవరిని ఏమి అన లేదన్నారు. ఎక్కడి నుంచో వచ్చి కొనిరెడ్డి కుటుంబం గురించి ఎంపిపి మాట్లా డడం సరికాదన్నారు. కొనిరెడ్డి కుటుంబం గురించి కొత్తపల్లె పంచాయతీ ప్రజలకు తెలుసునన్నారు. వైసిపి అధికారంలోకి రాకముందు ఆయన ఎక్కడున్నారు, ఏ పార్టీలో ఉన్నారో అది తెలుసుకొని మాట్లాడాలన్నారు. టిడిపి నాయకులు బీటెక్ రవి, శ్రీనివాస్‌రెడ్డి వరదరాజులరెడ్డి, బిజెపి నాయకుడు ఆదినారాయణరెడ్డితో తాను సంబంధాలు కలిగి ఉన్నానని చెప్పడం ఏమిటన్నారు. ప్రొద్దుటూరులో జనరల్ ఫండ్ కింద రూ.40 కోట్లు పనులు చేశానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎంపిపి కాకముందు శేఖర్ యాదవ్ ఆస్తులు ఎంత, ఇప్పుడు ఎంతనో ఆయన వివరించాలన్నారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు తనపై, తన కుటుంబంపై ఎప్పటికీ ఉంటాయన్నారు. కార్యక్రమంలో యువ నాయకుడు కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, గ్రామస్థాయి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న కార్మికులు

గత కొంత కాలంగా పరిష్కారం కాని సమస్యలను తీర్చాలని మున్సిపల్ కార్మిక సంఘ ప్రొద్దుటూరు శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంటి, సాల్మన్ కోరారు. రాష్ట్ర సంఘ పిలుపు మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు మానవహారంగా ఏర్పడి ధర్నా నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలుదఫాలుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 24న పెద్దఎత్తున చలో విజయవాడ కార్యక్రమం చేపట్టామన్నారు. నిరవధిక సమ్మె వరకైనా వెళ్లి పోరాడి సాధించుకుంటామన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, కోశాధికారి రాఘవేంద్ర, సాయి, కార్యదర్శి రవి కుమార్, మోహన్, నీతమ్మ, గుర్రమ్మ, రమాదేవి, అన్నపూర్ణ, నర్సమ్మ, లంక రవి పాల్గొన్నారు.

చీకటి ఒప్పందాలను అంగీకరించేదిలేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆంధ్రప్రదేశ్ పవర్ జెఎసి నాయకులు ప్రభుత్వంతో చేసుకున్న చీకటి ఒప్పందాలను తాము అంగీకరించబోమని కడప జిల్లా స్ట్రగుల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, సురేష్‌బాబు అన్నారు. చీకటి ఒప్పందంలో భాగంగా బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన కాంట్రాక్ట్ కార్మికుల జీతాల పెరుగుదలకు సంబంధించిన జిఒ కాపీలను గురువారం స్థానిక మార్కెట్ యార్డులోని సబ్‌స్టేషన్ ప్రాంగణంలో దగ్ధం చేశారు. ముఖ్యమంత్రి జగన్ తాను ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్రలో చేసిన హామీలను మాత్రమే తాము అడుగుతున్నామన్నారు. కొత్తగా ఏమి అడగడంలేదని తెలిపారు. కార్యక్రమంలో ఓబులేసు, రత్నమాచారి పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం చేయండి

వేంపల్లె : ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు యువత రక్తదానం చేయాలని సర్పంచు రాచినేని శ్రీనివాసులు కోరారు. కున్ కా రిస్తా సహకారంతో స్థానిక గాంధీ రోడ్డులోని ఆర్ఎంఎస్ వీధిలోని ఎంజె గ్రీన్ టెండర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త దానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు వీలుంటుందని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల గుండె జబ్బులు, కాన్సర్ వచ్చే అవకాశం తక్కువగా ఉంటాయన్నారు.

అవగాహన కోసమే 'పొలంబడి' : జెడి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : పంటలపై సరైన అవగాహన కల్పించడమే పొలంబడి కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని జిల్లా వ్యవసాయ అధికారి ఎ.నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక రూరల్ పరిధిలోని కల్లూరు గ్రామంలోని నరేందర్‌రెడ్డి పొలంలో గురువారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పంటలపై సరైన అవగాహన కల్పించి చిన్నచిన్న సాంకేతిక మార్పులు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. నాణ్యమైన ఉత్పత్తులు పండించేలా చేయడమే పొలంబడి ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి రైతు పొలాన్ని పరిశీలించి ఖర్చులు తగ్గించి, రైతులు స్వయంగా నిర్ణయం తీసుకునే శాస్త్రవేత్తగా తయారు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేంద్రరెడ్డి, ఎడిఎ సురేష్, ఎఒ శశికలారెడ్డి, వ్యవసాయ శిక్షణ కేంద్రం నుండి ఎఒ శివ శైలజ, పద్మజ, ఎడిఎ రమణారెడ్డి, వివిఎ పవన్ పాల్గొన్నారు.

సరైన సమయంలో పురుగు మందులు వాడాలి

చక్రాయపేట : సరైన సమయంలో పురుగు మందులు వాడాలని మండల వ్యవసాయాధికారి నవంత్‌బాబు సూచించారు. మండలంలోని కె.రాజుపల్లె గ్రామంలో ఎఒ నవంత్ బాబు గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిఇఒ ప్రసాద్, సెంట్రల్ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సిబ్బంది కొరత.. అందని పశువైద్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో పశువైద్య సిబ్బంది కొరత కారణంగా పాడి రైతులు, గొర్రెల యాజమానులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండల వ్యాప్తంగా 18 వేల గొర్రెలు, 4500 గేదెలతోపాటు కోళ్లు, ఆవులు, ఎద్దులు ఇతర పశువులు అధికంగా ఉన్నాయి. మండలంలోని బిదినంచర్ల, సుంకేసుల, సింహాద్రిపురంలో పశువైద్యశాలలున్నాయి. అయితే బిదినంచర్ల పశు వైద్యశాలకు మాత్రమే రెగ్యులర్ డాక్టర్ ఉన్నారు. సుంకేసుల, సింహాద్రిపురంలో పశువుల డాక్టర్ లేకపోవడంతో బిదినంచెర్ల వైద్య అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు. అంకాలమ్మ గూడూరు, బలపనూరు, కోరగుంటపల్లె గ్రామాల్లో పశు వైద్య ఉప కేంద్రాలున్నాయి. బలపనూరులో రెగ్యులర్ సిబ్బంది లేకపోవడంతో వారానికి ఒకసారి మాత్రమే సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే పశువైద్య సిబ్బంది కొరత ఉంది. తమ పశువులకు, గొర్రెలకు ఏదైనా వ్యాధి సోకితే ప్రయివేటు వారిని ఆశ్రయించాల్సి వస్తోందని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న జబ్బుకు కూడా అధికంగా డబ్బులు తీసుకుంటున్నారని పాడి రైతులు చెబుతున్నారు. వ్యవసాయానికి ప్రత్యామ్నాయ పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం పట్ల ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నా, క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన సిబ్బందిని నియమించాలని పాడి రైతులు, గొర్రెల యజమానులు కోరుతున్నారు.



బలపనూరులో మూసేసిన పశు వైద్య ఉపకేంద్రం

ఆమోదయోగ్యమైన పిఆర్‌సి ఒప్పందం చేయాలి



నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పవర్ జెఎసి, విద్యుత్ యాజమాన్యాల మధ్య జరిగిన ఉద్యోగుల వేతన సవరణ ఒప్పందం మీద ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తం చేస్తూ నిరసన తెలుపుతున్నారు. ఇందులో భాగంగా స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ వద్ద ఉద్యోగులు, కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సంస్థల చరిత్రలో ఎన్నడూ లేని అతి తక్కువ 8శాతం ఫిట్మెంట్‌కు జెఎసి ఒప్పదం చేసుకోవడం ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. 16 మాసాలు ఆలస్యం చేసి నామమాత్రం ఫిట్మెంట్‌కు అంగీకరించడం అంటే కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా జెఎసి వైఖరి ఉందన్నారు. ఓ వైపు 8శాతం నామమాత్రపు ఫిట్మెంట్ ఇస్తూ, మరో వైపు ఉద్యోగులకు ఇస్తున్న కొన్ని అలవెన్సుల్లో కోత పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికులకు 2022 పిఆర్‌సి ప్రకారం కాకుండా 2018 వేరకు వేతనాలకు అంగీకరించడం దారుణమన్నారు. ఒక్కో కార్మికుడు సుమారు రూ.7 వేల నుండి రూ.10వేల వరకు నష్టపోతారని అన్నారు. పర్మనెంట్ ఊసే చర్చలో లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ ఉద్యోగులు, ఇంజనీర్లు ఈ పిఆర్‌సి వల్ల డిఎ, ఇంక్రిమెంట్‌తోపాటు పెన్షన్ ప్రయోజనాలు నష్టపోతారని తెలిపారు.. యాజమాన్యం ఈ ఒప్పదం పునఃసమీక్షించాలని, అందరితో చర్చించి ఆమోదయోగ్యమైన పిఆర్‌సి ఒప్పదం చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో స్ట్రగుల్ కమిటీ కన్వీనర్ పి.శివయ్య, ఉద్యోగ నాయకులు కొండారెడ్డి, వెంకటస్వామి, వెంకట్, జగదీష్, ప్రతాప్, కాంట్రాక్టు కార్మిక నాయకులు గంగయ్య , రాము, నాగేంద్ర, పుల్లారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాత్రికేయుల సమస్యలపై సానుకూలత : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పాత్రికేయుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీరామా హాల్ రోడ్డు సమీపంలో ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ రూముల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్‌ను గురువారం ఎంపీ, మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తొండూరు మండల ఇన్‌ఛార్జి వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ పాత్రికేయులనుద్దేశించి మాట్లాడుతూ అందరూ ఐక్యతతో ఉండాలని, ప్రజా సమస్యలు పత్రికలు, ఛానళ్ల ద్వారా తమ దృష్టికి తీసుకురావడంతో వెంటనే వాటిని పరిష్కరించగలుగుతున్నామని తెలిపారు. జగనన్న ప్రభుత్వం పాత్రికేయులకు అండగా ఉంటుందన్నారు. అన్ని విధాలా సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. పాత్రికేయుల సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. అనంతరం వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మాచిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోశాధికారి ఓం ప్రకాష్, గౌరవ అధ్యక్షులు రమేష్, మారుతీ, వివేక్, కృష్ణకుమార్(కిట్టు), కమిటీ సభ్యులు, ప్రెస్‌క్లబ్‌కు పాత్రికేయుల సహాయనిధి కింద రూ.5లక్షలు అందించాలని ఎంపీకి వినతి పత్రమిచ్చారు. ఇందుకు ఎంపీ స్పందిస్తూ ఆ మేరకు హామీ ఇచ్చారు. ఇటీవల ఇద్దరు పాత్రికేయులు మృతి చెందారని ఆయన తెలపగా, వారి కుటుంబాలకు కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ముందుగా ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు ఎంపీని ఘనంగా స్వాగతించారు. కార్యక్రమానంతరం ఎంపీని ఘనంగా సత్కరించారు. పాడా ఒఎస్‌డి అనిల్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ గోటూరు చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, వేల్పుల రామలింగారెడ్డి(రాము), వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ డైరెక్టర్ అంబకపల్లె నారాయణస్వామి, వార్డు కౌన్సిలర్ కొండలరావు, రైట్స్ డైరెక్టర్ త్యాగరాజు, మార్కెట్ యార్డు కమిటీ వైస్ చైర్మన్ కంచర్ల సర్వోత్తమ్‌రెడ్డి, సర్పంచు భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, పార్నపల్లె కిషోర్, దాసరి చంద్రమౌళి, చంద్రమౌళి, లక్ష్మి భార్గవి, నాయకులు, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి, తహశీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, బేకరీ శంకర్, బెంగళూరు బేకరీ శివ, వైయస్ఆర్ ప్రెస్ కమిటీ శేషారెడ్డి, అమర్, రవీంద్ర, సురేంద్ర, మురళి, చాంద్ బాషా, చిక్కని హరికుమార్, రామ్మోహన్‌రెడ్డి, కృష్ణ, హరీష్, విమన్, పవన్, జాకీర్, పుల్లయ్య, రాము, ప్రతాపరెడ్డి, గంగరాజు, మహేష్, శంకర్‌రెడ్డి, ప్రసాద్, జగన్, డేనియల్ బాబు, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయతీ పరిధిలోని ముద్దనూరు రోడ్డు నుండి కడప రోడ్డు వరకు గల నాలుగు వరుసల రహదారి వెంబడి ఉన్న డివైడర్లలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఎర్రగుంట్ల నగర పంచాయతీ శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించి గురువారం ఉదయం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి కడప రోడ్డు బస్టాండ్ ఎదురుగా ఉన్న డివైడర్లలో మొక్కలు నాటారు. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద ఐదు లక్షల రూపాయలను వెచ్చించి, డివైడర్ వెంబడి దాదాపు 700 మొక్కలు నాటేలా, వాటి సంరక్షణకు ట్రీ గార్డ్ ఏర్పాటు చేసేలా నగర పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు.

ఫొటోల ఫోజులకేనాని పలువురి విమర్శ

మొక్కలు నాటే కార్యక్రమానికి సంబంధించి ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తోంది. అధిక కాలుష్యంతో నగర పంచాయతీ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం హర్షించదగ్గ విషయమే. కానీ మునుపు 'మన ఊరి కోసం టీం', 'మల్లు ఫౌండేషన్' ఆధ్వర్యంలో పట్టణంలోని కొందరు యువకులు తమ సొంత నిధులతో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఇరువైపులా పెద్దపెద్ద కుండీలను ఏర్పాటు చేసి అందులో మొక్కలను నాటారని యువకులు చేసిన పనిని గుర్తు చేశారు. ఆ మొక్కలకు నీరు అందించే బాధ్యత మున్సిపల్ అధికారులు తీసుకొని గాలికి వదిలేశారు. ఇప్పుడు మళ్లీ మొక్కలు నాటుతున్నామంటూ రూ.5 లక్షల ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మొక్కలు నాటే కార్యక్రమం ఫొటోలకు ఫోజులివ్వడం కోసమే అంటూ పలువురు చర్చించుకుంటున్నారు. ఎక్కడైనా మొక్కలు నాటేముందు ఎరువులు వేస్తారని, కానీ అవేమీ లేకుండానే ఒక అడుగు గుంతలోనే ఆరు అడుగుల మొక్కను నాటుతున్నారని, వారి పనితనం కళ్ళముందే కనిపిస్తోంది అంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

రాజారెడ్డి హత్య కేసు సిట్‌కు అప్పగించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఇటీవల హత్యకు గురైన డాడీ హోమ్, పూజ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజారెడ్డి కేసును సిట్‌కు అప్పగించాలని టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజారెడ్డి హత్య దర్యాప్తులో 10 గంటలకు పోస్టుమార్టం పూర్తి చేసి గుండెపోటుగా ఇటు వైద్యులు అటు పోలీసులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రీ పోస్టుమార్టం చేయాలని సిఫారసు చేయడంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. పూజ ఇంటర్నేషనల్ స్కూల్ యజమాని రాజారెడ్డి కేసులో పోలీసులు తప్పిదాలు చాలా ఉన్నాయని ఆరోపించారు. డిజిపి స్పందించి ఈ కేసును సిట్ ద్వారా విచారించాలన్నారు. పార్టీలకతీతంగా విచారించి అసలు నిందితులకు శిక్ష పడేలా చేయాలన్నారు. రాజారెడ్డి ట్రస్ట్ ఆస్తులపై కన్నేసి, అతన్ని బిగ్‌బాస్ కనుసన్నల్లోనే హత్య చేశారన్నారు. ప్రొద్దుటూరులో రూ.10 కోట్ల స్థిరాస్థి ఉన్న వారందరూ ఒక గన్‌మెన్‌ను పెట్టుకోండని సూచించారు. రాజారెడ్డిలా తన ప్రాణానికి కూడా ముప్పు ఉందని, తనకు ఏదైనా జరిగితే పోలీసులు, అధికార పార్టీ నాయకులే కారణం అవుతారని అన్నారు. సమావేశంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జాబిఊల్లా, రాష్ట్ర బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి తాటి శ్రీనివాస్ యాదవ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి భాస్కర్‌రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, రాజుపాలెం మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, అధికార ప్రతినిధి దస్తగిరి, మాజీ కౌన్సిలర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

రాజారెడ్డి హత్య కేసులో రాజకీయ ప్రమేయం లేదు

- ఎఎస్‌పి ప్రేరణకుమార్

రాజారెడ్డి హత్య కేసులో అసత్య ప్రచారాలు, ఆరోపణలు వస్తున్నాయని, ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఇలాంటి అసత్య ప్రచారాలు, పోలీసు శాఖపై ఆరోపణలు చేయడం సబబు కాదని ఎఎస్‌పి ప్రేరణకుమార్ తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రవీణ్ వద్ద ఎలాంటి ఆధారాలున్నా పోలీసు శాఖకు సమర్పించాలన్నారు. పోలీసులే పోస్ట్‌మార్టం నిమిత్తం రాజారెడ్డి మృతదేహాన్ని డాక్టర్లకు అప్పగించారని, అన్ని భాగాల్లో పోస్ట్‌మార్టం చేయాలని చెప్పామన్నారు. మొదటి పోస్ట్‌మార్టం త్వరగా జరిగినందున పోలీసులకు అనుమానం వచ్చిందని, విచారణ వేగవంతం చేసి అనుమానాలను వ్యక్తం చేసిన పోలీసులు రెండవసారి పోస్ట్‌మార్టం చేయమని ఎస్‌పి ఆదేశించారన్నారు. 2వసారి పోస్ట్‌మార్టం నిర్వహించే సమయంలో ఇన్‌స్పెక్టర్ ఇబ్రహీం ఆధ్వర్యంలో వీడియో తీసి నివేదిక పొందామన్నారు. అసత్య ప్రచారం చేస్తున్న ప్రవీణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాజారెడ్డిది రాజకీయ హత్య కాదని.. ఆస్థి తగాదాల వల్లనే హత్య జరిగిందని ధ్రువీకరించారు. రాజారెడ్డి హత్యపై తన దగ్గర ఉన్న ఆధారాలను ప్రవీణ్ పోలీసులకు సమర్పించాలని కోరారు. సమావేశంలో పట్టణ సిఐలు రాజారెడ్డి, నారాయణ యాదవ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటు నమోదు ప్రక్రియ

- ఆర్‌డిఒ వెంకటేశులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పారదర్శకంగానే ఓటు నమోదు ప్రక్రియ జరుగుతోందని ఆర్‌డిఒ వెంకటేశులు తెలిపారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో గురువారం అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఓటు నమోదు ప్రక్రియలో సహకరించాలని, ఏమైనా మీకు అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు.

పులివెందుల మున్సిపాలిటీకి సంబంధించి ఓటరు ప్రక్రియలో సమస్యలు ఉన్నాయా అని నాయకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు హాఫీజ్, టిడిపి నాయకులు తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, జనసేన పార్టీ తరఫున శ్రీపతి శ్రీనివాసులు, ఇతర పార్టీ నాయకులు, తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పెద్దజొన్నవరంలో సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలోని పెద్ద జొన్నవరం గ్రామంలో గురువారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పుడున్న సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత లబ్ధిదారులు ఎక్కడికి పోకుండా కేవలం వారి ఇంటి వద్దనే వాలంటరీ వ్యవస్థతో ప్రజలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు అందిస్తున్నామన్నారు. గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైసిపి సమన్వయ కార్యకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, ఎంపిపి జయచంద్రారెడ్డి, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

సర్వే పూర్తయిన గ్రామాల్లో రాళ్లు ఏర్పాటు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలో 2వ విడత కింద 10 రెవెన్యూ గ్రామాల్లో జగనన్న భూ రక్ష పథకం ద్వారా సర్వే నిర్వహించి పూర్తయిన గ్రామాల్లో రాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు సర్వేయర్ స్నేహలత తెలిపారు. మొదటి విడతలో వెంగన్నగారిపల్లెలో పథకాన్ని అమలుచేసి రైతులకు పత్రాలను కూడా ఇచ్చామన్నారు. ప్రస్తుతం చిన్నగురువులూరు, పెద్ద గురువలూరు, అల్లాడుపల్లె, వెదురూరు, అనంతపురం, తుమ్మలపాడు, చాపాడు, బద్రిపల్లె, కుచ్చుపాప, బూడిదపాడు రెవిన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేసి హద్దుల వద్ద రాళ్లు ఏర్పాటు చేయడం ప్రారంభించామన్నారు. సర్వేలో భాగంగా రైతుల నుండి ఆధార్, ఫోన్ నెంబర్, ఖాతా నెంబర్‌కు సంబంధించి తమ సిబ్బంది సమాచారాన్ని సేకరించారని తెలిపారు. ఆన్‌లైన్‌లో లేని రైతులకు ప్రత్యేక దరఖాస్తులు అందజేస్తున్నామన్నారు. ఆధారాలు చూపిస్తే వారి పేరు ఆన్‌లైన్‌లో నమోదు చేయించే అవకాశం ఉంటుందన్నారు. పంట పొలాల్లో జిపిఎస్ రోడర్ ద్వారా హద్దులను గుర్తించి క్యూజి ఐ ఎస్ సాఫ్ట్‌వేర్‌కు అప్డేట్ చేయిస్తున్నామన్నారు. రాళ్లు ఏర్పాటు చేసే చర్యలు ముమ్మరం చేశామన్నారు. వెంగన్నగారి పల్లెలో 146 మంది రైతుల ఖాతాలకు సంబంధించి 50 సర్వే నెంబర్లను పూర్తి చేసి 300 ఎల్‌పిఎం ఖాతాలు అందించామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సర్వేలు, ఇతర మండలాల సిబ్బంది పాల్గొంటున్నారని, త్వరగా సర్వే పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

పైడిపాలెంలో లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని పైడిపాలెం గ్రామానికి గురువారం రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వగ్రామమైన పైడిపాలెంకు రావడంతో తహశీల్దార్ మహబూబ్ బాషా పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. శుక్రవారం గ్రామంలోని నాగులకట్ట వద్ద జరిగే పూజా కార్యక్రమానికి హాజరుకానున్నారు.స్థానికులతో పలు అంశాలపై చర్చించారు.

అనాథ రోగికి చికిత్స చేయించిన 'మానవత'

ప్రజాశక్తి - వేంపల్లె

జయలక్ష్మి అనే అనాథ మహిళకు చికిత్స అందించి మానవత సేవా సంస్థ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అనారోగ్యంతో పడి ఉన్న జయలక్ష్మి అనే అనాథ మహిళను కానిస్టేబుల్ రవి గుర్తించి మానవత సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, కావలి కృష్ణతేజాకు సమాచారమిచ్చారు. స్పందించిన మానవత సభ్యులు జయలక్ష్మిని ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వ వైద్యురాలు మల్లేశ్వరమ్మ ప్రథమ చికిత్స చేశారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నంత వరకు జయలక్ష్మికి వైద్యం అందించాలని కోరారు. ఆ మహిళకు కటిక రాజా రూ.1000 ఆర్థికసాయం చేశారు. అనంతరం పలువురు మానవత సభ్యులను, కటిక రాజాను అభినందించారు. ఆనాథలను ఆదుకోవడమే లక్ష్యంగా మానవత సేవా సంస్థ పని చేస్తున్నట్లు చక్రపాణిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మానవత సభ్యులు గోవర్ధన్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలను నిర్వహిస్తాం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రాజారెడ్డి ఆశయాలకు అనుగుణంగా పాఠశాలను నిర్వహిస్తామని, ప్రభుత్వ నిబంధన మేరకు నడుచుకుంటామని ఆర్‌డిఒ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక పూజ ఇంటర్నేషనల్ స్కూల్లో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఇక్కడ చదివే 500 మంది పిల్లలకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా కలెక్టర్ విజయ్‌రామరాజు, జిల్లా అధికారులతో ఒక కమిటీని వేసి రాజా ఫౌండేషన్‌లో ఉండే శరణార్థులను, స్కూల్లో ఉండే విద్యార్థులకు, ఉపాధ్యాయులు భవిష్యత్తుకు ఇబ్బంది లేకుండా చూస్తారన్నారు. ట్రస్ట్ బోర్డు మెంబర్స్‌పైగానీ, ట్రస్ట్ కార్యకలాపాల్లో గానీ వేరే వ్యక్తులు జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ ట్రస్ట్ జిల్లా అధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. పిల్లలు, ఉపాధ్యాయుల బాగోగులు చూసుకునేందుకు పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. గతంలో రాజారెడ్డి ఏ విధంగా స్కూల్ నిర్వహించారో అలాగే స్కూలు జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు భయపడాల్సిన పనిలేదని వారికి భరోసా ఇచ్చారు.

పాలెం దొరస్వామి నాయుడు మహోన్నత వ్యక్తి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పాలెం దొరస్వామి నాయుడు ఎంతో ఘన చరిత్ర కలిగిన గొప్ప వ్యక్తి అని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక అహోబిలపురం పాఠశాలలో ఆదే పాఠశాల స్థల దాత పాలెం దొరస్వామి నాయుడు విగ్రహాన్ని ఎంపీ, మున్సిపల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, తొండూరు మండల వైసిపి ఇన్‌ఛార్జి వైయస్ మదన్‌మోహన్‌రెడ్డి, పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం రాకముందు దాదాపు 1909వ సంవత్సరంలో ఎంతో ఉన్నతమైన ఆలోచనలతో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలనే గొప్ప సంకల్పంతో ఈ పాఠశాలను దొరస్వామి నాయుడు స్థాపించారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, కౌన్సిలర్లు కిశోర్ పాల్గొన్నారు.

బెల్లం కృష్ణారెడ్డికి ఎంపీ నివాళి

చక్రాయపేట : మండలంలోని చిలేకంపల్లె గ్రామం వనంలో పల్లెకు చెందిన మాజీ సింగల్ విండో అధ్యక్షుడు బెల్లం కృష్ణారెడ్డి మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి గురువరాం కృష్ణారెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎపి టూరిజం డైరెక్టర్ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్‌పిటిసిని టిటిడి మెంబర్‌గా ఎంపిక చేయాలి

ప్రజావక్తి - వేంపల్లె

వేంపల్లె మండల రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న జడ్‌పిటిసి మాచిరెడ్డి రవికుమార్‌రెడ్డిని టిటిడి పాలకమండలి సభ్యునిగా ఎంపిక చేయాలని ఆయన మిత్ర బృందం కోరింది. టిటిడిలో బోర్డు డైరెక్టర్ పదవి ఇవ్వాలని కోరుతూ రవి కుమార్‌రెడ్డి మిత్రులు సుబ్బారావు, చలపతి, ఆరిఫా మస్తాన్, శంకరయ్య సిఎం జగన్ , ఎంపీ అవినాష్‌రెడ్డికి గురువారం ఫ్యాక్స్ ద్వారా లేఖను పంపారు. రవికుమార్ రెడ్డి మొదటి నుంచి వైఎస్ కుటుంబం వెంట నడుస్తూ, వేంపల్లె మండల అభివృద్ధికి విశేషకృషి చేశారని ఆ లేఖలో పేర్కొన్నారు. మండల ప్రజ లకు అండగా ఉంటూ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని వివరించారు.